క్లుప్తంగా

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మండలంలోని నామాపూర్, నందగిరి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీం కార్డులు పంపిణీ చేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను ఓటర్లను వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ చేతి గుర్తుకు ఓటేసి లక్ష్మణ్‌కుమార్‌కు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు శ్రీనివాస్ మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భరత్‌రెడ్డి, మల్లేశం, భిక్కయ్య, పవన్ రెడ్డి, నాంపెల్లి, కొమురయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి

జగిత్యాల: బడుగు, బలహీనవర్గాల్లో వెలుగులు నింపేందుకు వందశాతం కృషి చేస్తానని ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ అన్నారు. జగిత్యాలలో విలేకరులతో మాట్లాడుతూ, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చైతన్యకుమార్, ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దూడ తిరుపతిని ప్రకటించినట్లు తెలిపారు. 93 శాతం బీఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజాస్వామ్య వాదులు ధర్మం వైపు ఎన్నికల బరిలో నిలబడిన వారిని గెలిపించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కో

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. టేశ్, రమేశ్, వెంకటేశ్, జీవన్ పాల్గొన్నారు.

'రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొనవద్దు'

జగిత్యాల: రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనవద్దని మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణ మహిళా సమాఖ్య వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ ఉన్న నేపథ్యంలో ఆర్పీలు ఓటింగ్‌కు జనాలను తరలించడం గానీ, మీటింగ్‌లు పెట్టడం గానీ చేయరాదని, ఒకవేళ నియమాలు ఉల్లంఘిస్తే ఎలక్షన్ కోడ్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతి లేని సామగ్రి తరలిస్తే చర్యలు

జగిత్యాలక్రైం: శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అనుమతి లేని సామగ్రి, నగదు, ఇతర వస్తువులను గాని తరలిస్తే చర్యలు తప్పవని జగిత్యాల రూరల్ ఏఎస్సై శంకరయ్య అన్నారు. మంగళవారం రాత్రి జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి వ్యక్తి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంచుకోవద్దని, ఏదైనా సామగ్రి కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదు వెంట ఉంచుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గొల్లపల్లి: గొల్లపల్లి, వెన్గుమట్ల గ్రామాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గొల్లపల్లి వార్డు మెంబర్ ఫోరం అధ్యక్షుడు బీఆర్ఎస్ సంయుక్త కార్యదర్శి గురిజాల బుచ్చిరెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కచ్చు మల్లయ్య, పడాల సత్తన్న, వెన్గుమట్ల వార్డు సభ్యుడు ఎల్లాల లింగారెడ్డి, యూత్ కన్వీనర్ ఎల్లాల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏలేటి రాంరెడ్డి, పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణగౌడ్, రాజేశ్వర్ రావు, నేరెల్ల మహేశ్, వూటూరి సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి వివిధ పార్టీల నాయకులు

కోరుట్ల: పట్టణంలోని మాదాపూర్ కాలనీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు సుమారు రెండు వందల మంది మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్ పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ఎస్కే వాజిద్, అజార్, రేష్మ,రాజహంస,జమున పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కోడ్ ఉల్లంఘనపై కాంగ్రెస్ ఫిర్యాదు

• ఫ్లెక్సీలు తొలగించిన బల్దియా సిబ్బంది

జగిత్యాలటౌన్: ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బతుకమ్మ సంబరాల్లో పాల్గొనేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఇంటి యజమానుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గోడలపై బీఆర్ఎస్ పార్టీ నినాదాలు రాస్తూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గుండ మధు, మన్సూర్, శేఖర్, జీవన్, గుంటి జగదీశ్వర్, మహిపాల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు,



ఫ్లెక్సీలు తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

ఫ్లెక్సీల తొలగింపు

ఎమ్మెల్సీ కవిత జగిత్యాల పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం బల్దియా సిబ్బంది తొలగించారు. జగిత్యాల పట్టణంలోని జంబిగద్దెతో పాటు పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎన్నికల అధికారులు బల్దియా సిబ్బందితో తొలగింపజేశారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి

• ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని 12 వార్డుకు చెందిన సుమారు 40 మంది యువకులు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వుజ్జగిరి శ్రీనివాస్, జలేందర్, నవీన్, నగేష్, అనిల్, రాహుల్, ఉపేందర్, సంపత్ తదితరులున్నారు.



యువకులకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

బీఆర్ఎస్‌కు ఆటో యూనియన్ మద్దతు

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆటో యూనియన్ సభ్యులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కి మద్దతు ఇవ్వాలని తీర్మానం చేశారు. అనంతరం సంజయ్‌ని కలిసి తీర్మానం కాపీ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: బీఆర్ఎస్ కార్యకర్తలు తన గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. మంగళవారం రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటింటికీ లబ్ధి చేకూర్చాయని, జరగబోయే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ పాదం లత, ఎంపీటీసీ పెంద్రం కవిత, గ్రామ అధ్యక్షుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కోనాపూర్‌లో ఎంపీపీ ప్రచారం

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్‌లో ఎంపీపీ కోల జమున ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వివరిస్తూ మహిళలతో కలిసి ఓట్లు అభ్యర్థించారు.

బతుకమ్మ చీరల చోరీ

ధర్మపురి: ప్రభుత్వం ఆడపడుచుల కోసం అందిస్తున్న బతుకమ్మ చీరెలను గుర్తు తెలియని దొంగిలించిన ఘటన మంగళవారం మండలంలోని దోనూర్‌లో చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోనూర్ గ్రామపంచాయతీ ఉంచి పంపిణీ చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వక్తులు పంచాయతీ తాళం పగులగొట్టి కార్యాలయంలోని 300 పైగా చీరెలను దొంగిలించుకు పోయారని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ముత్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ శివాజీ సూచించారు. పట్టణంలోని పోస్టాఫీస్ ఆవరణలో మంగళవారం బిజినెస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ పథకాల గురించి అవగాహన కల్పించారు. స్థానిక పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామని..ఇందులో కొత్తగా నమోదుతో పాటు మార్పులు, చేర్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పోస్ట్‌మాస్టర్ నగేశ్, సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల బైండోవర్

మెట్‌పల్లిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పలువురిని బైండోవర్ చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ నాయకులను మంగళవారం తహసీల్దార్ శేఖర్ ముందు బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మొరం తవ్వకాలను అరికట్టాలని వినతి

మెట్‌పల్లి: పట్టణ శివారులోని మున్సిపల్ డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న గుండు గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ స్థానిక రైతులు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పగలు, రాత్రి జేసీబీతో తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్లల్లో మొరం తరలిస్తున్నారని ఆయనకు వివరించారు. అతి వేగంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. వీటి గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని, వెంటనే తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎంపీ సంఘం ప్రతినిధి

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుల సంఘ జిల్లా సభ్యుడు ప్రభురాజ్ కిశోర్ మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

బీర్‌పూర్ సర్పంచ్‌కు ఉత్తమ సర్పంచ్‌గా పురస్కారం

సారంగాపూర్: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ జన సంస్థ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల్లో వివిధ రంగాల్లో రాణిస్తున వారికి పురస్కారాలను అందించారు. బీర్‌పూర్ సర్పంచ్ గర్షకుర్తి శిల్పకు ఉత్తమ సర్పంచ్‌గా మంగళవారం పురస్కారం అందజేశారు. బీర్‌పూర్ అభివృద్ధికి సర్పంచ్ శిల్ప చేస్తున్న కృషికి ఈ పురస్కారం అందజేసినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.

పసునూర్‌లో ఇంటింటా ప్రచారం

మేడిపల్లి: మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని చెన్నమనేని అజిత్‌రావు అన్నారు. భీమారం మండలం పసునూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, నాయకులు అంగడి ఆనంద్, నెల్లుట్ల ప్రభాకర్, శ్రీనివాస్, వంగ వెంకటేశం, లింగారెడ్డి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మల్లాపూర్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ పనులపై మండలస్థాయి 13వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జగదీష్ తెలిపారు.

19 న మేడిపల్లిలో రాహుల్‌గాంధీ పర్యటన

మేడిపల్లి: కొండగట్టు పర్యటనలో భాగంగా రాహుల్‌గాంధీ శుక్రవారం మేడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించే సభలో పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నరేశ్ రెడ్డి తెలిపారు.సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

వెల్గటూర్‌లో హెల్త్ క్యాంప్

వెల్గటూర్: మండల కేంద్రం లోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌లతో పాటు వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు మురళిగౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారి విచారణ

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం జిల్లా వైద్యాధికారి శ్రీధర్ విచారణ చేపట్టారు. స్థానిక 12వార్డుకు చెందిన ఓ గర్భిణి కొన్ని రోజుల క్రితం జ్వరంతో సదరు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. ఆ తర్వాత పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను నిజామాబాద్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. దీనికి మెట్‌పల్లి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. అలాగే రెండు రోజుల క్రితం ఓ గర్భిణి ప్రసవం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆమెకు సీజేరియన్ చేయగా, మృత శిశువు జన్మించింది. సకాలంలో ప్రసవం చేయకపోవడం వల్లనే శిశువు మరణించిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ రెండు సంఘటనలపై వైద్యాధికారి ఆయా ఆస్పత్రులకు వెళ్లి వివరాలు సేకరించారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమివ్వాలి



దరఖాస్తు సమర్పిస్తున్న ప్రేమ్‌సాగర్ నేత

ధర్మపురి: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ధర్మపురి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి జాడి ప్రేమ్‌సాగర్ నేత కోరారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ప్రజలు ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మల్లాపూర్ : ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో తహసీల్దార్ వీర్‌సింగ్‌కు ఆయన వినతిపత్రం అందించారు. కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొని దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల సంక్షేమం కోసం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

బెల్ట్‌షాపులపై దాడులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో బెల్ట్‌షాపులపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఓ బెల్ట్‌షాపు నుంచి 5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు.

గిరిజనుల డిమాండ్లను మేనిఫెస్టోల్లో చేర్చాలి

జగిత్యాలటౌన్: గిరిజనుల 34 డిమాండ్లను ప్రతి రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టోలో పొందు పరిచి అమలు చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీగార్డెన్స్‌లో ట్రైబల్ డిక్లరేషన్ సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ మాట్లాడుతూ జనరల్ స్థానాల్లో గిరిజనులకు పది ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని, మైదాన ప్రాంత ఐటీడీఏ, పోడు భూములకు శాశ్వత పరిష్కారం, సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవుగా ప్రకటించాలని, గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్ చేర్చాలని, జీవో 3ను పునరుద్ధరించాలని, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి గిరిజనుల 34 డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపు

జగిత్యాలఅగ్రికల్చర్: క్రీడాపోటీలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధనస్థానంలో మంగళవారం రాష్ట్రస్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలను వెంకటరమణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ ఆటలోనైనా ఒక్కరే గెలుస్తారని, పోటీల్లో పాల్గొన్న ప్రతీఒక్కరు గెలిచేందుకు చివరివరకు ప్రయత్నించాలని సూచించారు. మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్ డాక్టర్ జె.సత్యనారాయణ, యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ పద్మజ, వ్యవసాయవర్సిటీ క్రీడల పరిశీలకుడు డాక్టర్ జె.సురేశ్ వ్యవసాయ పరిశోధనస్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్ పాల్గొన్నారు.

వచ్చే ఉగాదిలోపు పేదలకు ఇళ్ల నిర్మాణం

సారంగాపూర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో కొస్తుందని, ఉగాదిలోపు రూ.5లక్షలతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయికపుగూడెంకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.



పార్టీలో చేరుతున్న గిరిజనులతో ఎమ్మెల్సీ

అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

జగిత్యాలటౌన్: అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని 34వ వార్డు పోచమ్మవాడ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

గిరిజన యువతికి ఎమ్మెల్సీ భరోసా

సారంగాపూర్: పోలీస్ ఉద్యోగంలో తనకు అత్యధిక మార్కులు వచ్చినా, పోలీస్ ఉద్యోగంలో ఆరు శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా తనకు ఉద్యోగం రాలేదని మండలంలోని నాయికపుగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి గడ్డం లత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మొరపెట్టుకోగా, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. దీనిపై హైకోర్టులో కేసు వేయించి న్యాయం జరిగేలా చూస్తానని యువతికి భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, కొత్తపేట ఉపసర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తాం.. బీజేపీని ఆదరించాలి

మల్లాపూర్: రాష్ట్రంలో బీజేపీని ప్రజలు ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో మంగళవారం గడపగడపకు బీజేపీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. తెలంగాణలో కేంద్రం అందిస్తున్న నిధులతోనే అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సీఎం కేసీఆర్ అసమర్థ పాలనకు నిదర్శనమే నిజాం షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడమేనని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, నియోజకవర్గ నాయకులు అనిల్, ఉపసర్పంచ్ అబ్బూరి నవీన్ గౌడ్, శక్తికేంద్రాల ఇన్‌చార్జి అంజిరాజ్ దండుగుల, బూత్ అధ్యక్షులు కుంట జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



చిట్టాపూర్‌లో ప్రచారం చేస్తున్న నవీన్‌కుమార్

ప్రజాస్వామిక పాలన బీజేపీతోనే సాధ్యం

కథలాపూర్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామిక పాలన సాధ్యమవుతుందని, తెలంగాణ రాష్ట్రం గడీల్లో బందీ అయ్యిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎర్రం మహేశ్ అన్నారు. మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో మంగళవారం బీజేపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటల రుణమాఫీ ఐదేళ్లు గడిచిన పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ఇంకా కొత్త హామీలను ఏలా నెరవేర్చుతుందని మండిపడ్డారు. సూరమ్మ ప్రాజెక్టు పనులు ఐదేళ్లలో తట్టెడు మట్టి పనులు చేయించకపోవడం సిగ్గుచేటన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు అంటూ ఐదేళ్లుగా పేద ప్రజలను మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత, రైతులు, మహిళలు బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు గాంధారి శ్రీనివాస్, కథలాపూర్ మహేశ్, జుంబర్తి రాజేందర్, ముస్కరి కిశోర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

బీసీలకు 70 సీట్లు ఇస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ

మల్లాపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 70 సీట్లు ఇస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీయేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూదరి నిషాంత్ కార్తికేయ అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లోని భరత మాత కూడలి వద్ద బీఎస్పీ మండలశాఖ ఆధ్వర్యంలో «బహుజన రాజ్యాధికార గర్జన బహిరంగ సభ» కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారం చేపట్టి తొమ్మిదిన్నర ఏళ్లు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చని బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధిచెప్పాలన్నారు. ఈ నెల 21న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించే «బహుజన రాజ్యాధికార గర్జన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు బోడ ప్రశాంత్, మండల ఇన్‌చార్జి మోతే రమేశ్, ప్రధాన కార్యదర్శి నల్ల నాగశేషు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ఇరువురు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ఏడుమోటలపల్లి గ్రామానికి చెందిన కముటం కమల (45) అనే మహిళ కొద్ది రోజుల క్రితం నుంచి మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందిందని భర్త రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నంచర్లలో వయోభారంతో..

మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన కుంటాల గంగవ్వ (88) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..అనారోగ్య సమస్యలు, వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలు వెంటాతుండగా బాధలు భరించలేక గంగవ్వ మంగళవారం ఇంటి ఆవరణలోని చేదబావిలో పడి ఆత్మహత్య చేసుకుందన్నారు. కుమారుడు దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెట్‌పల్లిలో యువకుడు..

మెట్‌పల్లిరూరల్: ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.మెట్‌పల్లి పట్టణానికి చెందిన రహ్మాద్ పాషా(32) అనే యువకుడు పట్టణంలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు,పెళ్లి కాక ఇబ్బందులు పడుతున్నాడు. రహ్మద్ తల్లిదండ్రులు ఇటీవల వరంగల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు.దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి యాకుబ్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మెట్‌పల్లిరూరల్: మండలంలోని మారుతినగర్ శివారులో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మానాల ప్రవీణ్(42) అనే వ్యక్తి ఈ నెల 15న కోరుట్లలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించి రెండు రోజులుగా చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఉదయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.